క్లుప్తంగా

ముంపు సమస్య పరిశీలన

అమలాపురం టౌన్: పట్టణంలోని 28, 29 వార్డుల్లోని సావరం రోడ్డులో వర్షం వస్తే చాలు డ్రెయిన్లు పొంగి రోడ్డంతా మునిగిపోయి నానా ఇబ్బందులు పడుతున్నామని ఆ వార్డులకు చెందిన పలువురు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో కమిషనర్ సావరం రోడ్డును మంగళవారం పరిశీలించి ఆ వార్డు ప్రజలతో చర్చించారు. మురికి నీరు డ్రెయిన్ల నుంచి రోడ్డుపైకి చేరడంతో మోటారు సైకిళ్లు, కార్లు వెళ్లేందుకు చాలా అసౌకర్యంగా ఉంటోందని వివరించారు. 29వ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, 28వ వార్డు ప్రతినిధి గోపి రమేష్ తదితరులతో కలసి కమిషనర్ స్థానికులతో ఈ సమస్య పరిష్కారానికి చర్చించారు. డ్రెయిన్లలో పూడికలు పెరిగిపోయి ఈ సమస్య ఉత్పన్నమవుతోందని వారు చెప్పారు. త్వరలోనే కొత్త డ్రెయిన్ నిర్మాణం చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

అమలాపురం టౌన్: కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని జిల్లా వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా ఆందోళన వ్యక్తం చేశారు. గౌతమ్ రాజా అమలాపురంలో మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ గూండాలు దొంగ ఓట్లు వేయడంతో ఓటర్లు చాలా మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదని ఆయన పేర్కొన్నారు. టీడీపీ గూండాలు ఓటర్ల వద్ద నుంచి ఓటర్ స్లిప్పులను బలవంతంగా లాక్కుని దౌర్జన్యం చేశారన్నారు. ఇలాంటి ఎన్నికలు దేశ చరిత్రలో ఇప్పటి వరకూ ఎక్కడా, ఎప్పుడూ జరగలేదని విమర్శించారు. ఈ ఎన్నికల ద్వారా కూటమి ప్రభుత్వం ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుందో బోధ పడడం లేదని స్పష్టం చేశారు. ఇలా దొంగ ఓట్లతో నెగ్గి కూటమి ప్రభుత్వం రాక్షస ఆనందం పొందాలనుకుంటుందని విమర్శించారు. ఈ ఎన్నికలు జరిగిన తీరును తామంతా వ్యతిరేకిస్తున్నామని గౌతమ్ రాజా తెలిపారు.

ఈదురుగాలులకు నేలకూలిన వృక్షాలు

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం వీచిన ఈదురుగాలులకు మండలంలోని పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అకస్మాత్తుగా భారీస్థాయిలో గాలివీయడంతో చాలాచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. జార్జిపేట పంచాయతీలో భారీ వృక్షం హైటెన్షన్ విద్యుత్ లైన్‌పై పడడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి వృక్షాలను, విద్యుత్ స్తంభాలను తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్

యానాం: పుదుచ్చేరి పోలీస్ శాఖలో 148 కానిస్టేబుల్ (గ్రూప్-సి, నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్) పోస్టులకు మంగళవారం పోలీస్ శాఖ స్పెషల్ ఆఫీసర్ ఎలుమలై నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 13 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మొత్తం పోస్టుల్లో 33 శాతం మహిళలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. పురుషులకు–100, మహిళలకు–48 పోస్టులను కేటాయించారు. జనరల్ అభ్యర్థులకు 63, ఎంబీసీలకు 26, ఓబీసీలకు 16, ఎస్సీలకు 16, ఈబీసీకి 2, బీసీఎంకు 2, ఎస్టీ 1, బీటీ 1, ఈడబ్ల్యూఎస్‌కు 14 కేటాయించారు. ఎంఎస్‌సీలకు 7, ఎక్స్ సర్వీస్‌మెన్లకు 14 కేటాయించారు.

చంద్రబాబు పాలనలో అమలుకాని హామీలు

- ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, డాక్టర్ శ్రీకాంత్
- ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించిన వైఎస్సార్ సీపీ నాయకులు


క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధి చెప్పిన తేదీలకే అందిస్తారనే నమ్మకం ఉండేది. ఇప్పుడు చంద్రబాబు పాలనలో హామీలే తప్ప ఎలాంటి లబ్ధి ఉండదన్న అపనమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. పట్టణ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని 28, 29 వార్డుల్లో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో ఇజ్రాయిల్, శ్రీకాంత్ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. స్థానిక సావరం షిర్డీ సాయి మందిరం వద్ద పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని ఆధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే ఓ అపనమ్మకం.. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన ఆయన నిజ స్వరూపాన్ని ఇప్పుడు ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు రెట్టింపు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ చంద్రబాబుకు ఓట్లు వేసి పెద్ద తప్పు చేశామన్న అభిప్రాయం ప్రజల నుంచి వినిపిస్తోందన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో చాలామంది అర్హులకు పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం అప్పుడు ఇంటికి వచ్చి ఇస్తే ఇప్పుడు చౌక డిపోలకు వెళ్లి ఎండలో కూలో నిలబడి తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పింది. కూటమి ప్రభుత్వం వసూలు చేస్తున్న చార్జీల కారణంగా కరెంట్ బిల్లులు రెట్టింపయ్యాయని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. 28, 29 వార్డు కౌన్సిలర్లు గోపి రాజీ, చిత్రపు రామకృష్ణ తదితరులు చంద్రబాబు మోసాలను వివరించారు. సభలో చంద్రబాబు మోసాలతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శించి నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పేరి శ్రీనివాసరావు, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, మున్సిపాలిటీ పార్టీ పరిశీలకుడు సాగిరాజు సాయిరాజు తదితరులు ఆ రెండు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు సంసాని చంద్రశేఖర్, చిట్టూరి పెదబాబు, కట్టోజు సన్నయ్యదాసు, కొల్లాటి దుర్గాబాయి, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ, పార్టీ నాయకులు గోపి రమేష్, కుడుపూడి భరత్ భూషణ్, ఉండ్రు బాబ్జి, విత్తనాల మూర్తి, కల్వకొలను ఉమ, యండమూరి శ్రీను తదితరులు తదితరులు పాల్గొన్నారు.


టి.కొత్తపల్లిలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ఉప్పూడిలో క్యూఆర్ కోడ్ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చంద్రబాబు మోసాలు ప్రతి ఒక్కరికీ తెలియాలి

ఐ.పోలవరం: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను చంద్రబాబు ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయడం లేదనే విషయాన్ని వైఎస్సార్ సీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరికీ తెలియాలని మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమం మండల పరిధిలో టి.కొత్తపల్లిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటపతిరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు విడుదల చేసే మేనిఫెస్టోలో ప్రతి హామీని నెరవేర్చాల్సిన బాధ్యత అధికారంలోకి వచ్చేవారిపై ఉంటుందని, ఈ విషయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఎన్నికల హామీ క్యూఆర్ కోడ్‌ను వెంకటపతిరాజు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మాతా మురళి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో విత్తనాల వెంకటేశ్వరావు, వడ్డీ గౌతం, విజయబాబు, కె.ప్రసాద్, కొమానపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో కూటమి అధికారం

కాట్రేనికోన: మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ నడింపల్లి సూరిబాబు అన్నారు. ఉప్పూడిలో మంగళవారం సలాది తులసీరావు అధ్యక్షతన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోలోని అంశాలను ఉదహరిస్తూ చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్లను అందచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాలెపు ధర్మారావు, కోలాటి సత్యం, బీర జాన్, ర్యాలి వీరబాబు, రంబాల శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను విమర్శిస్తే సంహించం


విద్యాసాగర్

ఉప్పలగుప్తం: రాష్ట్ర శాసనమండలి సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అగ్రకులాల నాయకుల ప్రోద్బలంతో గల్లీ నాయకులు సైతం స్థాయికి మించి ఆయనను విమర్శిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల విగలాంగ సంఘ అధ్యక్షుడు చేట్ల విద్యాసాగర్ మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను అవమానిస్తూ కావాలనే కొందరు సోషల్‌మీడియాలో వ్యాఖ్యలు చేయడాన్ని విద్యాసాగర్ మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ సమావేశంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సీఎం కావాలని ఆయన అభిమానులు కలలు కంటూ త్యాగాలు చేస్తుంటే ఆయన 15 ఏళ్లపాటు టీడీపీతో సావాసం చేయాలని వాళ్ల కార్యకర్తలకు సందేశం ఇస్తున్నారన్నారని ఎమ్మెల్సీ స్థాయిలో ఉన్న ఇజ్రాయిల్ విమర్శించడంలో తప్పేముందన్నారు. కొందరు జనసేన నాయకులు ఈ వ్యాఖ్యలపై భుజాలు తడుముకుంటున్నారన్నారు. దళిత ఎమ్మెల్యేగా కొనసాగుతున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ వార్నింగ్ ఇస్తున్నట్టు వీడియో చిత్రీకరించి ప్రచారం చేయడం ద్వారా ఆనందం పొందడం ఎంత వరకూ సబవు అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను విమర్శిస్తే మావత్తు మాదిగ జాతిని అవమానించడమేనని, ఇటువంటి చర్యలు కొనసాగితే చూస్తూ ఊరుకునేది లేదని విద్యాసాగస్ హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు శాన్వి ఎంపిక


రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు ఎంపికైన శాన్వి

అమలాపురం రూరల్: అమలాపురంలో ఇటీవల నిర్వహించిన కోనసీమ జిల్లా అండర్ –17 బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని బి.శాన్వి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుందని కోచ్‌లు వి.శ్రీనుబాబు, కె.రాజు తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న అండర్ –17 రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో శాన్వి కోనసీమ జిల్లా నుంచి పాల్గొననుంది. 7 సంవత్సరాల వయస్సున్న శాన్వి అండర్ –17 విభాగంలో ద్వితీయస్థానం సాధించడం హర్షించదగ్గ విషయమని కొనియాడుతూ పాఠశాల యాజమాన్యం, చైర్మన్ నాయుడు, డైరెక్టర్ నంద్యాల మనువిహార్ అభినందించారు.

మహిళా వాకర్ల సేవలు అభినందనీయం


వాకర్స్ జిల్లా గవర్నర్ నాగేశ్వరరావును సత్కరించిన మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గోఖలే సెంటరులో క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి వాకర్స్ గవర్నర్ నాగేశ్వరరావు హాజరై క్లబ్ చేస్తున్న కార్యకలాపాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అమలాపురంలో మహిళా వాకర్స్ క్లబ్ ఏర్పడి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ సమావేశంలో గవర్నర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నడక ఉద్యమాన్ని ముఖ్యంగా మహిళల వద్దకు క్లబ్ తీసుకుని వెళ్లి సఫలీకృతమైందన్నారు. సమావేశంలో క్లబ్ జోన్ చైర్‌పర్సన్ దువ్వూరి సుబ్బలక్ష్మి, క్లబ్ కార్యదర్శి గోటేటి లక్ష్మి, క్లబ్ ప్రతినిధులు పేరి లలిత, పుత్సా రాజేశ్వరి, శిష్టా లక్ష్మీదేవి, వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతనిధులు పి.గోపాలకృష్ణ, గోటేటి గంగాధరరావు, పేరి లక్ష్మీనరసింహం, శిష్టా శ్రీహరి, పట్నాల రమణ పాల్గొన్నారు. చివరిగా తమ క్లబ్‌ను సందర్శించిన వాకర్స్ గవర్నర్ నాగేశ్వరరావు మహిళా వాకర్స్ ఘనంగా సత్కరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



నూతన ఎస్పీ కోదండరామ్‌ను సత్కరించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: నూతన ఇన్‌చార్జి ఎస్పీగా నియమితులైన చింతా కోదండరామ్ మంగళవారం ఆర్ఏఓ మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలసి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా కోదండరామ్‌ను మునిస్వామి సత్కరించారు. యానాం పట్టణానికి చెందిన కోదండరామ్ పుదుచ్చేరి పోలీస్‌శాఖలో అనేక ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య వేడుకలు, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం యానాం ఎస్పీగా కోదండరామ్‌ను నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రత పరిరక్షణకై అందరితో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించేందుకు యానాం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఎస్పీ కోదండరామ్‌ను సీఐ అడలరసన్, ఎస్సైలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, శేరు నూకరాజు కలసి అభినందనలు తెలిపారు.

జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు తగదు


విద్యుత్ శాఖ సిబ్బందిని అడ్డుకున్న స్థానికులు

ఐ.పోలవరం: మురమళ్లలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆ శాఖ అధికారులు వేరే చోట మార్చేందుకు చేసిన యత్నాలను స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొత్త మురమళ్లలో జగన్న కాలనీ నిర్మించారు. ఈ కాలనీలో 536 వరకు నివాస గృహాలు ఉన్నాయి. ఈ కాలనీకి ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాగా వాటిని గత ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేశారు. వీటిలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగంలో ఉన్నాయి. పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణం జరిగితే మరో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగంలోకి వస్తాయి. మంగళవారం ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని వెళ్లేందుకు విద్యుత్ సిబ్బంది ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. దీనిని రాజోలు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ వారు సిబ్బందిని, వాహనాన్ని చుట్టు ముట్టారు. స్థానికుల ఆందోళన తెలుసుకుని అక్కడకు వచ్చిన ఏపీఈపీడీసీఎల్ ఏఈ శీలం ఏసురాజు దీనిని చార్జింగ్ కోసం పట్టుకుని వెళుతున్నట్టు చెప్పారు. అందుకు తగిన రికార్డు చూపించాలని స్థానికులు కోరగా ఆయన నీళ్లు నమిలారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో స్థానికులు ఫోన్‌లో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు. విషయం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లవద్దని ఆదేశించడంతో విద్యుత్ శాఖ సిబ్బంది అక్కడ నుంచి వెళ్లిపోయారు.

నులి పురుగులను నివారిద్దాం


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న నోడల్ అధికారి మల్లేశ్వరి, చిత్రంలో డీఎంఅండ్‌హెచ్‌వో

అమలాపురం టౌన్: పిల్లల్లో రక్త హీనత, పోషకాహార లోపం, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలకు కారణమవుతున్న నులి పురుగులను సమూలంగా నిర్మలిద్దామని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర పిలుపునిచ్చారు. స్థానిక కొంకాపల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర పాల్గొన్నారు.విద్యార్థులకు నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విధిగా ఈ మాత్రలను మింగాలన్నారు. డాక్టర్ సుమలత, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు

ఐ.పోలవరం: కేశనకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని పది సచివాలయాలు, వాటి పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలు, కాలేజీల్లోని విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మాత్రలు అందజేసినట్టు కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.ఎస్.రాజేష్ బాబు, వైద్యురాలు యు.నాగవర్ష తెలిపారు. ఎన్‌డీడీ జిల్లా అధికారి ఎస్.రవి మురమళ్ల జెడ్పీ పాఠశాలలో మాత్రల పంపిణీని పరిశీలించారు. ఎంపీడీవో డీఎల్.ఎస్.శర్మ, ఎంఈవో ఎన్.కొండారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో ఎం.వెంకటేశ్వర్లు, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.మేష్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

కాట్రేనికోన: యువత చెడు వ్యసనాలు గంజాయి, మద్యం సేవించి జీవితాలను ఛిద్రం అమలాపురం డీఎస్పీ టీఎస్‌కే ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం చెయ్యేరు శ్రీనివాస అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణ చట్టాలు, సైబర్ మోసాలు, గంజాయి, డ్రగ్స్, మద్యం సేవించి వాహనాలు నడపడంతో వచ్చే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, ఎస్సై అవినాష్, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎన్ వర్మ, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

అమలాపురం రూరల్: వ్యవసాయ పనులకు ఉపాధిహామీని అనుసంధానం చేయాలని ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి అధికారులకు సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై అమలాపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం సోషల్ ఆడిట్ ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ అధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఏడాదికాలంలో మండల పరిధిలోని 22 గ్రామాల్లో రూ.12,79,31,230 నిధులతో చేపట్టిన 1,040 పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. గ్రామాల వారీగా డీఆర్పీలు సేకరించిన అంశాలను ఎస్ఆర్పీ సింహాద్రి సభలో నివేదిక రూపంలో వివరించారు. ఉపాధిహామీలో జరిగిన లోటుపాట్లలో భాగంగా ఉద్యోగుల నుంచి రూ.11,840, పంచాయతీరాజ్ నుంచి రూ.3,100 రికవరీ చేసినట్లు డ్వామా పీడీ మధుసూదన్ తెలిపారు. సామాజిక తనిఖీలో స్టేట్ రిసోర్సు పర్సన్ వై.గౌరీశంకర్, అంబుడ్స్‌మన్ అడపావెంకట శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్సు ఆఫీసర్ కె.సత్యనారాయణ, ఎస్ఆర్పీ ఏపీవో విస్సర్తి శ్రీనుబాబు భారతీయ కిసాన్ సంఘ రాష్ట్ర ప్రతినిధి ఉప్పుగంటి భాస్కరరావు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తత అవసరం

తాళ్లరేవు: ప్రమాదకరమైన టీబీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు డాక్టర్ ఈశ్వర్ కోరారు. మంగళవారం నీలపల్లి ఆరోగ్య ఉప కేంద్రం వద్ద టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ డేవిడ్, సీహెచ్‌ఓ పెర్సిస్, హేమంత్, సత్య, పి.ప్రసాద్, ఎస్.ప్రసాద్, ఏఎన్ఎంకే పద్మ, హెల్త్ అసిస్టెంట్లు ఆంజనేయులు, బాలకృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేషనల్ మజ్దూర్ యూనియన్ ఉద్యోగుల ధర్నా

అమలాపురం రూరల్: నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం అమలాపురం డిపోలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఎన్ఎంయూ సెక్రటరీ పి.మణిరాజు ఆధ్వర్యం వహించా రు. ఈధర్నాకు సంఘీభావంగా యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సెక్రెటరీ వి.గణపతి మద్దతు తెలిపారు. డిపో అధ్యక్షుడు ఔలియా పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ చినవలసలకి చెందిన బొడ్డు రాజేశ్వరి మంగళవారం బీపీ ట్యాబ్లెట్లను అధిక మోతాదులో మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం ఉదయం ట్యాబ్లెట్లు మింగడంతో అపస్మారక స్థితికి వెళ్లిన ఆమెను కుటుంబ సభ్యులు తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆమెకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపెద్దల వేధింపుల కారణంగా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపింది. గ్రామంలో మహాలక్ష్మి ఆలయం వద్ద నిర్మించిన రెండు దుకాణాల్లో ఒకటి తనకు కేటాయించాలని కోరగా ఎనిమిది మంది గ్రామపెద్దలు రూ.3 లక్షలు డిమాండ్ చేయడంతో వారికి వివిధ రూపాల్లో నగదు అందజేసినట్లు తెలిపింది. రూ. 2.20 లక్షలు పెద్దల సమక్షంలో, మరో రూ.80 వేలు ఫోన్‌పే ద్వారా అందజేసినట్లు తెలిపింది. ఆ దుకాణాలు అటవీశాఖ నిర్మించినట్లు తెలిసి డబ్బు లు వెనక్కి ఇవ్వాలని కోరగా వారు నిరాకరించారని ఆమె తెలిపింది. ఫోన్‌పే, వీడియో ఆధారాలతో కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. దీనిపై ఎస్సై పి.సత్యనారాయణను వివరణ కోరగా రాజేశ్వరి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తాళ్లరేవు సామాజిక ఆస్పత్రి నుంచి సమాచారం వచ్చిందని, ఈ ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడికి రిమాండ్

కాట్రేనికోన: మహిళపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తికి న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించినట్లు కాట్రేనికోన ఎస్సై అవినాష్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని చెయ్యేరులో రాత్రి వేళ ఇంటిలో నిద్రిస్తున్న మహిళపై దార్ల అన్నవరం (చిన వీర వెంకట సత్యనారాయణ) అత్యాచారయత్నం చేయగా బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుని ముమ్మిడివరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

పోగొట్టుకున్న 39 ఫోన్ల గుర్తింపు

ఆలమూరు: మండలంలో మూడు నెలల నుంచి వివిధ కారణాల రీత్యా పోగొట్టుకున్న లేదా చోరీకి గురయిన 39 మొబైళ్లను గుర్తించామని ఆలమూరు ఎస్సై జి.నరేష్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో పోలీసులు రికవరీ చేసిన ఏడు మొబైళ్లను బాధితులకు మంగళవారం అందజేశారు. ఎస్సై నరేష్ మాట్లాడుతూ మొబైల్స్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందవద్దన్నారు. మొబైల్స్ పోయిన వారి కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఆ యాప్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేస్తే సత్వరమే సమీప పోలీసుస్టేషన్ విచారణ చేపడుతుందన్నారు.

అథ్లెటిక్స్‌లో పార్థు ప్రతిభ



ముమ్మిడివరం: విశాఖలో ఈనెల 9న ఆరవ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్స్ పోటీల్లో కొత్తలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి సబ్బతి పార్థు సంజీవసాగర్ షాట్‌పుట్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించినట్లు ప్రత్యేక విద్య ఉపాధ్యాయుడు గంగుల సురేష్ తెలిపారు. 400, 200 మీటర్ల పరుగు పందెంలో పార్థు ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు ఆయన చెప్పారు. హెచ్ఎం గోవర్ధన్ గిరి, ఉపాధ్యాయులు, బాబాయి, నాగరత్నం, సుజాత, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తిళ్లాలమ్మ ఆలయ హుండీలో నగదు చోరీ

ఐ.పోలవరం: తిళ్లకుప్ప గ్రామ దేవత తిళ్లాలమ్మ ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు చొరబడి హుండీని బద్దలు కొట్టి అందులోని నగదును అపహరించారు. గ్రామ దేవతకు చెందిన హుండీని ఈ రెండేళ్ల కాలంలో ఐదుసార్లు దొంగలు అహరించారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు మంగళవారం సర్పంచ్ కడియం తమ్మయ్య,గ్రామస్తులు తెలిపారు.

బోటు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల పంపిణీ

అల్లవరం: ఓడలరేవు గ్రామానికి చెందిన తొమ్మిది మత్స్యకార బోట్లుకు రిజిస్ట్రేషన్ చేసి లైసెన్సు సర్టిఫికెట్లను ఎఫ్‌డీఓ ఎమ్మెల్యే ఆనందరావు అమలాపురంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లు విష్ణుమూర్తి, లబ్ధిదారులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

అల్లవరం: విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే ఉద్యోగులకు గుర్తింపునిస్తాయని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అన్నారు. బోడసకుర్రు సచివాలయాలు 1, 2లో సర్పంచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బోడసకుర్రు 1, 2 సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తూ వివిధ సచివాలయాలకు వెళ్లిన ఉద్యోగులకు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దొమ్మేటి శ్రీశాంతి భవాని, మాజీ సర్పంచ్‌లు దొమ్మేటి శ్యాంప్రకాష్, సాపే ధర్మరాజు, ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, ముత్యాల బాబి, కార్యదర్శి బి.ఆదిశంకరం, వీఆర్వో చిట్టిబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.